క్లుప్తంగా

పరిసరాలు శుభ్రం



గ్రీన్ అంబాసిడర్లను సన్మానిస్తున్న అధికారులు

పూతలపట్టు: మండల పరిధిలో అధికారులు బుధవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా 'చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని' ప్రారంభించారు. గత ప్రభుత్వంలో మండలంలోని అన్ని పంచాయతీల్లో కొనసాగుతున్న డంపింగ్ యార్డును మూడునెలల నుంచి అధికారులు పట్టించుకోలేదు. బుధవారం వాటిని తిరిగి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈఓపీఆర్డీ శ్రీనివాసులు మాట్లాడుతూ పంచాయతీల్లో గ్రీన్ అంబాసిడర్లు మీ వద్దకే వచ్చి చెత్తను సేకరించి వాటిని డంపింగ్ యార్డులో నిల్వ ఉంచుతారని తెలిపారు. అనంతరం గ్రీన్ అంబాసిడర్లను సన్మానించారు.

శివాలయంలో అన్నదానం



మొగిలి ఆలయంలో అన్నదానం చేస్తున్న కరణం సంక్షేమ సంఘ సభ్యులు

బంగారుపాళెం: మండలంలోని మొగిలి శివాలయంలో బుధవారం కరణం సంక్షేమ సంఘం వారు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా స్వయంభు శ్రీమొగిలీశ్వర స్వామి, కామాక్షమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాలయ అమావాస్యను పురస్కరించుకుని ఆలయ ఆవరణలో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో కరణం సంక్షేమ సంఘం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మహాలయ అమావాస్య పూజలు



నీవానది ఒడ్డున తర్పణం వదిలేందుకు క్యూకట్టిన జనం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలో బుధవారం మహాలయ అమావాస్య పూజలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఈ సందర్భంగా ప్రజలు పితృదేవతలకు పిండ ప్రదానాలు సమర్పించేందుకు పోటెత్తారు. నీవానది ఒడ్డున, గంగినేని చెరువు వద్ద తర్పణం, బ్రాహ్మణులకు సంతర్పణ చేసి ఆశీర్వచనాలు పొందారు. ఇలా చేస్తే పితృదేవతలను సంతృప్తి పరచడంతో పాటు పితృ దోషాలను తొలగుతాయని పండితులు తెలిపారు. తర్పణం వదిలేందుకు వచ్చిన జనంతో నీవానది, గంగినేని చెరువు వద్ద జనం కిటకిటలాడారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆ ప్రాంతం జనసందడిగా కనిపించింది.

నేర రహిత చిత్తూరే లక్ష్యం

చిత్తూరు అర్బన్: చిత్తూరు నియోజకవర్గాన్ని నేర రహితంగా మార్చేందుకు ప్రజలు సహకరించాలని ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ నాయుడు కోరారు. బుధవారం చిత్తూరులోని తన కార్యాలయంలో పోలీసు అధికారులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ చిత్తూరులో డ్రగ్స్, గంజాయి, సారా, కర్ణాటక మద్యం, పేకాట, లాటరీ, వ్యభిచార గృహాలు లాంటివి జరగడానికి వీల్లేదన్నారు. ఎక్కడైనా ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరిగితే పోలీసులు వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. సీఐలు జయరామయ్య, నెట్టికంఠయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కుండపోత వర్షం



చిత్తూరులో కురిసిన వర్షానికి రోడ్డు జలమయం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలో బుధవారం రాత్రి కుండపోత వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండవేడి తాళలేక జనం అల్లాడిపోయారు. ప్రజలు ఉక్కపోతతో అల్లాడిపోయారు. రాత్రి 7 గంటల ప్రాంతంలో జోరు వర్షం ప్రారంభమైంది. బలమైన గాలులు వీచాయి. ఉరుములు, మెరుపులతో అర్ధగంటకు పైగా వర్షం దంచికొట్టింది. దీంతో కాలువలు, రోడ్లు జలమయంగా మారాయి.

సారా ఊట ధ్వంసం

కుప్పం రూరల్: కుప్పం అటవీ ప్రాంతంలోని మోట్లచేను సమీపంలో దాడులు చేసి 300 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేసినట్లు ఫారెస్ట్ రేంజర్ జయశంకర్ బుధవారం తెలిపారు. సారా తయారీపై సమాచారం అందడంతో దాడులు చేసినట్లు చెప్పారు. సారా తయారీ, గంజాయి సాగుకు ఆకర్షితులై యువత తమ జీవితాలు జైలుపాలు చేసుకోవద్దని హితవు పలికారు.

మహాత్ముడి ఆశయ సాధనకు కృషి చేద్దాం

- పారిశుద్ధ్య కార్మికుల సేవలు ఎనలేనివి
- మహాత్ముడి అడుగుజాడల్లో నడుద్దాం
- వాడవాడలా గాంధీకి నివాళులు
- గాంధీ జయంతి వేడుకల్లో కలెక్టర్ సుమిత్‌కుమార్ పిలుపు



చిత్తూరు: గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న విజయానందరెడ్డి



కాణిపాకం ఆలయంలో.. మహాత్మునికి నివాళి..

చిత్తూరు అర్బన్: మహాత్మా గాంధీ జయంతి పురస్కరించుకుని స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా విజయవాడ వరదల్లో సహాయక చర్యల్లో పాల్గొన్న నగరపాలక పారిశుద్ధ్య కార్మికులను బుధవారం కార్పొరేషన్ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విజయవాడ వరద నేపథ్యంలో అక్కడ జరిగిన సహాయక చర్యల్లో పాల్గొని విధులు నిర్వర్తించిన పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్ట లేనివని కలెక్టర్ సుమిత్ కుమార్, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్, మేయర్ అముద కొనియాడారు.ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ మాట్లాడుతూ కార్మికులు ఎంతో శ్రమతో తక్కువ సమయంలోనే వార్డులను శుభ్రం చేశారన్నారు. వరదల్లో పారిశుద్ధ్య కార్మికులు సేవలు అభినందనీయమని, వారి సేవలను గుర్తించి వారిని సత్కరించినట్లు తెలిపారు. కలెక్టర్ సుమిత్ కుమార్ పారిశుద్ధ్య కార్మికుల సేవలను అభినందించి, రెండు జతల యూనిఫాం, స్వీట్లు అందించి శాలువతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ విద్యాధరి, అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ, కమిషనర్ నరసింహ ప్రసాద్, డిప్యూటీ మేయర్లు చంద్రశేఖర్, రాజేష్ కుమార్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు. అంతకుముందు వీరు నగరపాలక కార్యాలయంలోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. స్వచ్ఛతా హీ సేవా–2024 కార్యక్రమంలో భాగంగా నగరంలోని మున్సిపల్ పాఠశాలలో విద్యార్థులకు నిర్వహించిన పోటీలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఎమ్మెల్యే, మేయర్, కమిషనర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందించారు. ఈ సందర్భంగా మేయర్ అముద «గాంధీ పుట్టిన దేశం..» అనే గీతాన్ని ఆలపించి పిల్లలను ప్రోత్సహించారు.

చిరస్మరణీయులు మహాత్ముడు

చిత్తూరు కార్పొరేషన్: దేశ స్వాతంత్ర్యం కోసం అహింసా మార్గంలో పయనించి సాధించిన మహనీయుడు గాంధీ అని వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ విజయానందరెడ్డి తెలిపారు. బుధవారం గాంధీ జయంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి పార్టీ శ్రేణులతో కలిసి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, నగర పార్టీ అధ్యక్షుడు జ్ఞానజగదీష్, పార్టీ మహిళా విభాగం జిల్లా మాజీ అధ్యక్షురాలు గాయత్రీదేవి, నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అలాగే జెడ్పీ కార్యాలయంలో జిల్లాపరిషత్ వైస్ చైర్మన్ రమ్య గాంధీ చిత్రపటానికి నివాళులు అర్పించారు. రైల్వేస్టేషన్‌లో స్వచ్ఛభారత్ దివాస్ కార్యక్రమం నిర్వహించారు. స్టేషన్‌లో అధికారులు, ఉద్యోగులు చీపురుపట్టి శుభ్రం చేశారు. అనంతరం మహాత్ముడి చిత్రపటానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో స్టేషన్ మాస్టర్ ముత్తుస్వామి, వాణిజ్య ఇన్‌స్పెక్టర్ వెంకటేశులు, సీఐ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. బీజేపీ, సీపీఐ పార్టీల నాయకులు గాంధీ విగ్రహం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు.

తవణంపల్లెలో..

తవణంపల్లె: జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్ ఆధ్వర్యంలో గాంధీజీ చిత్రపటానికి పూజలు చేసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చిత్తూరు రూరల్ (కాణిపాకం)/ఐరాల: చిత్తూరు నగరంలోని జిల్లా క్షయనివారణశాఖ కార్యాలయంలోని గాంధీ మహాత్ముడి విగ్రహానికి బుధవారం జిల్లావైద్యారోగ్యశాఖ అధికారి ప్రభావతిదేవి నివాళులర్పించారు. తొలుత చిత్ర పటానికి పూజలు చేశారు. కార్యక్రమంలో జిల్లా క్షయ నివారణ అధికారి వెంకటప్రసాద్, అధికారులు పాల్గొన్నారు. అలాగే జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలోని రెడ్ క్రాస్ బ్లడ్ సెంటర్‌లో మహాత్ముడి చిత్రపటానికి సభ్యులు నివాళులర్పించారు. కాణిపాకం ఆలయంలో ఈఓ గురుప్రసాద్, స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఎస్‌ఐ ధరణిధర సిబ్బందితో కలిసి మహాత్ముడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

గుడిపాల: మహాత్ముడి ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఉపాధిహామీ అడిషనల్ డ్వామా పీడీ ఉమావాణి అన్నారు. బుధవారం వసంతాపురం సర్పంచ్ రజినీకాంత్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఇందులో భాగంగా బాపూజీ 155వ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గాం. దీని ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గుడిపాల మండలంలో ఉన్న అన్ని సచివాలయాల్లో గ్రామసభలు నిర్వహించారు. సీఎన్‌ఆర్ కళాశాలలో ర్యాలీ నిర్వహించారు. ఉపాధి హామీ ఏపీఓ సుబ్రమణ్యం, జూనియర్ అసిస్టెంట్ మధు, పంచాయతీ కార్యదర్శి పురుషోత్తంరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

జాతిపిత అడుగుజాడల్లో పయనిద్దాం

బంగారుపాళెం: మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో గాంధీ జయంతి ఘనంగా నిర్వహించారు. స్థానిక తగ్గువారిపల్లె గ్రామ సచివాలయ ఆవరణలో మహాత్ముడి చిత్రపటానికి నాయకులు, అధికారులు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ వాణిప్రియ మాట్లాడుతూ జై జవాన్–జైకిసాన్ నినాదంతో దేశానికి దిశా నిర్దేశమయ్యారన్నారు.











రైల్వేస్టేషన్‌లో పరిసరాలను శుభ్రం చేస్తున్న అధికారులు, కార్మికులను సన్మానిస్తున్న మేయర్, కలెక్టర్, ఎమ్మెల్యే, జెడ్పీ కార్యాలయంలో ..., గుడిపాల: మాట్లాడుతున్న అడిషనల్ పీడీ ఉమావాణి, మహాత్ముడికి శ్రద్ధాంజలి ఘటిస్తున్న బీజేపీ నాయకులు











గుడిపాల: సీఎన్‌ఆర్ కళాశాలలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఎంపీడీఓ కార్యాలయంలో..

జిల్లా క్షయ నివారణ కార్యాలయంలో..., గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్‌ఐ ధరణీధర, బంగారుపాళెం: తగ్గువారిపల్లె సచివాలయంలో ..

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న జిల్లా ఉపాధిహామీ పథక సంచాలకులు రవికుమార్

యాదమరి(పూతలపట్టు): ఉపాధిహామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధిహామీ పథక సంచాలకులు రవికుమార్ తెలిపారు. బుధవారం మండలంలోని మాధవరం పంచాయతీలో 2025–26 ప్రణాళికలో భాగంగా తొలి గ్రామసభ నిర్వహించారు. ఇందులో ఉపాధిహామీ పథకంలో చేసే వివిధ రకాల పనుల గురించి గ్రామస్తులకు వివరించారు. వలసలకు వెళ్తున్న గ్రామస్తులకు ఉపాధిహామీ పథకం ద్వారా లభించే లబ్ధిని గురించి తెలియజేయాలన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ఉపాధి పనుల గుర్తింపు ప్రక్రియలో పాల్గొని సహకారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో సహాయ పథక సంచాలకులు సుబ్రమణ్యం, సచివాలయ సిబ్బంది, ఏపీఓ బాల, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలకు దరఖాస్తులు

చిత్తూరు అర్బన్: చిత్తూరు అర్బన్, రూరల్ ప్రాంతాల్లో నూతన మద్యం పాలసీ ప్రకారం దుకాణాల లైసెన్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐలు శ్రీహరి, పురుషోత్తం కోరారు. బుధవారం ఆయా స్టేషన్లలో సీఐలు మీడియాతో మాట్లాడుతూ చిత్తూరు రూరల్ స్టేషన్ పరిధిలో ఐరాలలో 4 దుకాణాలు, తవణంపల్లె 4, బంగారుపాళ్యం 5, యాదమరి 3, పూతలపట్టు మండలాల్లో 3 దుకాణాలకు లైసెన్సులు జారీ చేస్తామన్నారు. అర్బన్ పరిధిలో చిత్తూరు నగరంలో 14, గంగాధరనెల్లూరు 4, పెనుమూరు 2, గుడిపాలలో 2 దుకాణాలు ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. ఆసక్తి ఉన్న వ్యాపారులు రూ.2 లక్షల డీడీతో చిత్తూరులోని ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌కు వస్తే తామే దరఖాస్తులను ఆన్‌లైన్ చేస్తామన్నారు. వ్యాపారులే అన్ని వివరాలతో ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తు అప్‌లోడ్ చేయవచ్చన్నారు. వివరాలకు 9440902530, 9492814414 నంబర్లలో సంప్రదించాలన్నారు.

6న ఐక్యవేదిక ర్యాలీ



పూతలపట్టులో ముస్లింల ర్యాలీ

పూతలపట్టు: చిత్తూరులో ఈ నెల6 తేదీన జరిగే ఐక్యవేదిక ర్యాలీని ముస్లింలు జయప్రదం చేయాలని ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు ఫోకత్ కోరారు. బుధవారం మండల కేంద్రంలోని మసీద్‌లో ఆయన మాట్లాడుతూ ముస్లింల హక్కులను, వారి సమస్యలను పరిష్కరించుకునేందుకు ఈ ఐక్యవేదిక ద్వారా అండగా ఉంటామని తెలిపారు.

నైపుణ్యాభివృద్ధితో ఉద్యోగావకాశాలు

సదుం: నైపుణ్యాభివృద్ధితో ఉద్యోగావకాశాలు పొందవచ్చని శాస్త్రవేత్త డాక్టర్ కరీముల్లా అన్నారు. భ మండలంలోని భట్లువారిపల్లెలో బుధవారం షరీఫ్ సాహెబ్, ఫాతిమాబీ మెమోరియల్ ట్రస్ట్, ఫిరెష్ట్ ఆధ్వర్యంలో వ్యవసాయం, అనుబంధ రంగాలపై యువతకు అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. తాము ఎంచుకున్న రంగంలో నైపుణ్యాలు పెంపొందించుకుంటే జీవితంలో స్థిరపడేందుకు అవకాశం ఉంటుందని పలువురు వక్తలు చెప్పారు. కార్యక్రమంలో బ్యాంకింగ్ రంగ నిపుణులు చంద్రారెడ్డి, రామమూర్తి, సూరిబాబు, వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ హేమంత్‌కుమార్, ప్రియ తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణ కలిగిన కార్యకర్తలే యూటీఎఫ్ బలం



యూటీఎఫ్ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ సంఘ నాయకులు

ఐరాల: ఉపాధ్యాయ ఉద్యమంలో క్రమశిక్షణ, నిబద్ధత కలిగిన కార్యకర్తలే యూటీఎఫ్ బలమని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్‌నాయుడు అన్నారు. సోమవారం మండలంలోని పాలకల జెడ్పీ హైస్కూల్‌లో మండల యూటీఎఫ్ శాఖ ఆధ్వర్యంలో యూటీఎఫ్ స్వర్ణోత్సవాలు విజయవంతంగా ముగిశాయి. మండల యూటీఎఫ్ అధ్యక్షుడు సురేష్‌బాబు ఆధ్వర్యంలో తొలుత యూటీఎఫ్ జెండాను ఆవిష్కరించి స్వర్ణోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సోమశేఖర్‌నాయుడు ఆధ్వర్యంలో సంఘం కోసం జీవితాలను త్యాగం చేసిన అమరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మణిగండన్, జిల్లా సహఅధ్యక్షుడు మునిరత్నం, పూర్వ ఉమ్మడి జిల్లా గౌరవ అధ్యక్షుడు రాధాకృష్ణ, జిల్లా కార్యదర్శులు, రాష్ట్ర కౌన్సిలర్లు, ఆడిట్ కమిటీ కన్వీనర్ బాబు, మండల యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

అందుబాటులో సబ్సిడీ ఉలవలు

ఐరాల: రైతులు సబ్సిడీ ఉలవలను సద్వినియోగం చేసుకోవాలని ఏఓ వరలక్ష్మి కోరారు. బుధవారం స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో మాట్లాడుతూ పంటల సాగులో ప్రత్యామ్నాయంగా ఉలవలను సాగు చేసుకోవాలన్నారు. ఉలవలను పశువులకు మేతగా వాడరాదని సూచించారు. పొలంలో ఉలవలను వేసి కలియదున్నితే భూసారం పెరుగుతుందన్నారు. ఉలవల గ్రాసాన్ని పశువులకు మేతగా వాడుకోవచ్చని తెలిపారు. కావల్సిన రైతులు దగ్గరలోని రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని కోరారు.

ఆకట్టుకున్న విద్యార్థుల వేషధారణ



అమ్మవారి వేషధారణలో విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్: నగరంలోని మిట్టూరులో ఉన్న ర్యాంకర్స్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో బుధవారం ముందస్తుగా దసరా పండుగ వేడుకలు నిర్వహించారు. ఆ పాఠశాలలోని విద్యార్థులు మహిషాసుర మర్దిని వేషధారణలో అందరినీ ఆకట్టుకున్నారు. అమ్మవారి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ రమణారెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చెడును వీడి మంచిని అలవరుచుకోవాలన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎంఈఓ రామ్మూర్తి నాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఆర్పీ కుటుంబానికి ఆర్థికసాయం



బంగారుపాళెం: ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న సీఆర్పీలు

బంగారుపాళెం: మండల విద్యాశాఖలో సీఆర్పీగా పనిచేస్తూ అనారోగ్యంతో మృతి చెందిన సుధాకర్ శెట్టి కుటుంబానికి బుధవారం ఆర్థికసాయాన్ని అందజేశారు. బైరెడ్డిపల్లె మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, ఎంఈఓలు, సీఆర్పీలు కలసి రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని తిమ్మోజుపల్లెలో సుధాకర్‌శెట్టి భార్య, పిల్లలకు అందజేశారు. కార్యక్రమంలో సీఆర్పీలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

పెద్దపంజాణి: మండలంలోని అప్పినపల్లె జెడ్పీ హైస్కూల్లో 10వ తరగతి చదువుతున్న కె. భావన రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైందని హెచ్‌ఎం నందకుమార్, పీఈటీ ఉదయ్ కుమార్ తెలిపారు. గత నెల చివరి వారం అన్నమయ్య జిల్లా మదనపల్లెలో నిర్వహించిన సెలెక్షన్స్‌లో ప్రతిభ కనబరచి అండర్–17 విభాగంలో జిల్లా జట్టుకు ఎంపికైందని, త్వరలో విజయనగరం జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలో విద్యార్థిని పాల్గొంటుందని వారు చెప్పారు.

ఘనంగా వార్షికోత్సవం



చెక్కును అందజేస్తున్న దాతలు

పూతలపట్టు: మండలంలోని మంగళ్ విద్యాలయంలో 49వ శ్రీకృష్ణదేవరాయ విద్యా సాంస్కృతిక సంఘ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు ఆర్థికంగా అండగా ఉండాలనే ఉద్దేశంతో పాటూరు రాజగోపాల్‌నాయుడు స్ఫూర్తితో గల్లా రామచంద్రనాయుడు శ్రీ కృష్ణ దేవరాయ విద్యా సాంస్కృతిక సంఘాన్ని స్థాపించి, అందులో దాతలను భాగస్వాములను చేసి పేద విద్యార్థులకు ఆర్థికంగా సహాయ పడుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, బీటెక్, సీఏలలో ప్రతిభ కనబరచిన 200 మంది విద్యార్థులకు రూ.40 లక్షలు ఉపకారవేతనంగా అందజేశారు. కార్యక్రమంలో మాజీమంత్రి గల్లా అరుణకుమారి, శ్రీ కృష్ణదేవరాయ విద్యా సాంస్కృతిక సంఘ అధ్యక్షురాలు గొరినేని రమాదేవి, టీటీడీ జేఈఓ శ్రీనివాసరాజు, ప్రముఖ రచయిత నామినేని సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి దసరా ఉత్సవాలు



వజ్రాలపురం బోయకొండ గంగమ్మ



బంగారుపాళెం గ్రామదేవత ముత్యాలమ్మ

బంగారుపాళెం: మండల కేంద్రం బంగారుపాళెం గ్రామదేవత శ్రీముత్యాలమ్మ ఆలయంలో గురువారం నుంచి దసరా, దేవీశరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 3వ తేదీ నుంచి 12వరకు 10 రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అమ్మవారు రోజుకో అలంకరణతో భక్తులను కనువిందు చేయనున్నారన్నారు. ఉత్సవాల్లో భాగంగా 3వతేదీ చందన అలంకరణలో, 4న బాల త్రిపుర సుందరిగా, 5న గాయత్రిదేవిగా, 6న లలితాత్రిపురసుందరిగా, 7న అన్నపూర్ణదేవిగా, 8న మహాదేవిగా, 9న సరస్వతీదేవిగా, 10న దుర్గాదేవిగా, 11న మహిషాసురమర్ధినిగా, 12న రాజరాజేశ్వరిదేవిగా అమ్మవారు దర్శనం ఇస్తారని తెలిపారు.

వజ్రాలపురంలో..

మండలంలోని వజ్రాలపురం బోయకొండ గంగమ్మ ఆలయంలో గురువారం నుంచి 12వ తేదీ వరకు దసరా, దేవీశరన్నవరాత్రి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తలు రాధమ్మ, కృష్ణప్ప తెలిపారు. 3వ తేదీ గురువారం గణపతి హోమం, కలశపూజ, బాలత్రిపురసుందరిదేవిగా, 4న శ్రీగాయత్రిదేవిగా, 5న అన్నపూర్ణదేవిగా, 6న లలితాత్రిపురసుందరిదేవిగా, 7న శ్రీమహాచండీదేవిగా, 8న శ్రీమహాలక్ష్మిదేవిగా, 9న శ్రీసరస్వతిదేవిగా , 10న శ్రీదుర్గాదేవిగా, 11న మహిషాసురమర్ధినిగా, 12న శ్రీరాజరాజేశ్వరి దేవిగా భక్తులకు దర్శనమివ్వనున్నారు.

నవరాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధం



దుర్గాంబ దేవస్థానంలో ఏర్పాటవుతున్న మండపం



చాముండేశ్వరి దేవి ఆలయంలో ఏర్పాట్లు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలో బుధవారం దసరా సందడి నెలకొంది. గిరింపేటలోని దుర్గాంబ దేవస్థానం, చాముండేశ్వరిదేవి ఆలయం, తేనెబండలోని ముత్యాలమ్మ ఆలయం, గుర్రప్పనాయుడువీధిలోని అంకాళపరమేశ్వరి ఆలయం, పొన్నియమ్మ ఆలయం, ఆంజనేయస్వామి ఆలయాలతో పాటు పలు ఆలయాలు నవరాత్రి ఉత్సవాలకు సిద్ధమయ్యాయి. అమ్మవారిని కొలువుదీర్చేందుకు ప్రత్యేక మండపాలు వెలిశాయి. ఈ మండపాలను కూడా నిర్వాహకులు భారీ స్థాయిలో ఏర్పాటు చేశారు. వీటికి విద్యుత్ దీపాలంకరణలను జోడించారు. దారి పొడవునా విద్యుత్‌దీపాలు కాంతులీనుతున్నాయి. దీంతో నగరంలో నవరాత్రి శోభ సంతరించుకుంది. ఆలయాల్లో గురువారం ఉదయం అభిషేక పూజలతో దసరా ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి.